# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 56 కోట్ల రూపాయల విడుదలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు.**
2. **రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ కు ఉపాధి హామీ పథకం కింద ఒక వెయ్యి 805 కోట్ల 24 లక్షల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.**
4. **ఆంధ్రా హస్తకళలకు కొండపల్లి బొమ్మలు ప్రతీకగా నిలుస్తున్నాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**
5. **పౌర సేవల దినోత్సవం సివిల్ సర్వీసెస్ డే ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి – సిఎంఆర్ఎఫ్ నుంచి 56 కోట్ల రూపాయల విడుదలకు ఆమోదం తెలిపారు. నిన్న గన్నవరం విమానాశ్రయానికి వెళ్తున్న సమయంలో సిఎంఆర్ఎఫ్ ఫైల్‌పై సంతకం చేసి, ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 7 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఆర్ధిక సహాయం విడుదలకు ఆమోదం తెలిపారు. గత 22 నెలల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్షకు పైగా లబ్ధిదారులకు 1,298 కోట్ల రూపాయలకు పైగా ఆర్ధిక సాయం అందించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ఆర్ధిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

--------------------------

రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నస్తూర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయంగా 40 లక్షలకు పైగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయం పండుగ కావాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని, అందుకే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని చెప్పారు. అధికారం చేపట్టిన ఏడాదిలోపే 25.35 లక్షల మంది రైతులకు

రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రైల్వే పాఠశాలలో... పలాస కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక తరగతులను పలాస శాసనసభ్యులు గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి నిన్న ప్రారంభించారు. దృశ్య మాధ్యమం విధానంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పలాసలో కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభం కావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కేంద్రీయ విద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాయుధ దళాలలో సేవలందిస్తున్న కుటుంబాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఒక వెయ్యి 805 కోట్ల 24 లక్షల రూపాయలను విడుదల చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ లో నిన్న వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధిని బలోపేతం చేసి పేదలు, అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో గ్రామీణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహచర మంత్రులతో కలసి ఈ రోజు నుంచి ఎనిమిది రోజులపాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. స్వర్ణాంధ్ర విజన్--2047లో భాగంగా సుపరిపాలనపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రభుత్వం ఉత్తమ పాలనా విధానాలు, డిజిటల్ గవర్నెన్స్, ప్రజలకు నాణ్యమైన సేవలు, ప్రభుత్వ విభాగాల సమన్వయం వంటి అంశాలపై మంత్రులకు శిక్షణ అందించనుంది.

మంత్రి నారాయణ బృందం ఈ నెల 27న స్వదేశానికి తిరిగి రానున్నారు. నిన్న సింగపూర్ చేరుకున్న మంత్రి నారాయణకు అక్కడి ప్రవాసాంధ్రులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

---------------------------

ఆంధ్రా హస్తకళలకు కొండపల్లి బొమ్మలు ప్రతీకగా నిలుస్తున్నాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో నిర్వహించిన కొండపల్లి బొమ్మల పండుగ--2026 ముగింపు వేడుకల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొండపల్లి బొమ్మలను రాష్ట్రానికి బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కొండపల్లి బొమ్మల కళను భావితరాలకు అందించేందుకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ కళను మరింత విస్తరించేందుకు పర్యాటక శాఖ

ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అగ్నిప్రమాదాల నివారణ , భద్రతపై అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించామని అగ్ని మాపక శాఖ అదనపు సంచాలకులు జ్ఞానసుందరం తెలిపారు. "సురక్షిత పాఠశాల – సురక్షిత ఆసుపత్రి – అగ్ని ప్రమాదాల నివారణ కోసం అగ్నిమాపక శాఖతో కలిసికట్టుగా" అనే నినాదంతో ఈ కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఒక వాణిజ్య సముదాయంలో ప్రజలు, విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ అవగాహన కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానసుందరం మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

---------------------------

పౌర సేవల దినోత్సవం – సివిల్ సర్వీసెస్ డేని ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్రజలకు పౌర సేవల అధికారులు మెరుగైన సేవలు అందించడం, తద్వారా ప్రజలు వారి ప్రాథమిక హక్కులు పొందేలా చూడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. భారతదేశ మొదటి హోం మంత్రిగా వ్యవహరించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 1947 ఏప్రిల్ 21 వ తేదీన మొదటి బ్యాచ్ పౌర సేవల ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన రోజును గుర్తు చేసుకుంటూ... 2006వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 21 న పౌర సేవల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు–డీఈవోలు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్–ఈఆర్వోలతో హైదరాబాద్ నుంచి దృశ్యమాధ్యమం విధానంలో నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ– ఎస్.ఐ.ఆర్.లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల మ్యాపింగ్ పరిస్థితిపై సమీక్షించిన ఆయన పట్టణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కు వలసలు వచ్చే వారికోసం నగర పరిధిలో మ్యాపింగ్ కోసం ప్రత్యేక వ్యూహం అనుసరించాలని సూచించారు. ఈ నెలాఖరుకల్లా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అధిక ఉష్ణోగ్రతలతో వడగాలులు, ఉక్కపోత తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో ఈరోజు 46 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 29 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================